## నేడు డైట్ సెట్ ధృవపత్రాల పరిశీలన

**-జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ రమేష్ బాబు**

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా విద్యా శిక్షణా సంస్థలో ఈ నెల 5వ తేదీన(నేడు) డైట్‌సెట్(డీసెట్)-2024కు సంబంధించిన ధృవపత్రాలు పరిశీలన చేయడం జరుగుతుం దని జిల్లా విద్యా శిక్షణా సంస్థ ప్రిన్సిపాల్ రమేష్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైతే అనివార్య కారణాల వలన ఇంతకు ముందు జరిగిన ధృవపత్రాల పరిశీలనకు రాలేదో వారు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని రావాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుండి 9వ తేదీ వరకు మీ సేవా కేంద్రాలలో వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలని, వీలైనన్ని ఎక్కువ కళాశాలలు ఎంపిక చేసుకోవాలన్నారు. 13వ తేదీన సీట్లు కేటాయించబడతాయని, 17వ తేదీ లోగా అడ్మిషన్ లెటర్ పొందిది తగినంత ఫీజు చెల్లించి 18వ తేదీన కేటాయించబడిన కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో సహా చేరాలన్నారు. కళాశాల బదలాయింపు (స్లైడింగ్) కొరుకునే వారు కూడా వెబ్ ఆప్షన్ ఇచ్చుకోవాలని తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## సిఎం కప్‌ను విజయవంతం చేయాలి : ఎంఇవో

**వెల్దుర్తి, డిసెంబరు 4 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్‌ను క్రీడా పోటీలను విజయవంతం చేయాలని మండల విద్యాధికారి లీలావతి కోరారు. బుధవారం మాసాయిపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల సన్నాహక సమావేశంలో స్థానిక వ్యాయామ ఉపాధ్యాయులు శ్యామ్‌సుందర్ శర్మ ఈ క్రీడల నిర్వహణకు సూచనలు, నియమాలు తెలిపారు. గ్రామస్థాయిలో ఈ నెల 7వ తేదీ నుండి 8వ తేదీ వరకు క్రీడలు నిర్వహించి ఎంపిక చేసిన జట్టును 10వ తేదీ నుండి 12వ తేదీ వరకు నిర్వహించనున్న మండలస్థాయి క్రీడలకు పంపాలని తెలిపారు. గ్రామ కమిటీలో పంచాయతీ కార్యదర్శి చైర్మన్‌గా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారుడు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు తప్పని సరిగా సీఎంకప్2024.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో వారు పాల్గొనే మండల, గ్రామ వివరాలతో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ధర్మపురి, సీనియర్ ఉపాధ్యాయులు రంగారెడ్డి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతి పత్రం అందిస్తున్న జేఏసి నాయకులు

### మంత్రి పొంగులేటిని కలిసిన జెఎసి నాయకులు

**చేర్యాల, డిసెంబరు 4, ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేర్యాల జేఏసి నాయకులు బుధవారం జనగామ డిసిసి అధ్యక్షులు నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి పది రోజుల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి చెప్తామని తెలిపారన్నారు.మంత్రిని కలిసిన వారు జేఏసి చైర్మన్ రామగళ్ళ పరమేశ్వర్,పూర్మ ఆగంరెడ్డి,మద్దూరు మాజీ జెడ్పీటీసి గిరికొండల్‌రెడ్డి, కొమ్మురవి, అందె అశోక్, అందె బీరయ్య, బుట్టి సత్యనారాయణ, బుట్టి శ్రీనివాస్, చెరుకు రమణారెడ్డి,కామిడి జీవన్‌రెడ్డి, మెరుగు కృష్ణ, ఆడెపు నరేందర్, సనాది భాస్కర్, అందె నానిబాబు, గద్దల మహేందర్, కొండపాక బిక్షపతి, ఈరి భూమయ్య, రామగళ్ల నరేష్ ఉన్నారు.

### రైతాంగానికి సాగు నీరు అందించాలి

**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి హరీష్‌రావు లేఖ**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

యాసంగి పంట వేసేందుకు రైతులు సమయాత్తం అవుతున్న క్రమంలో జిల్లాలోని రైతాంగానికి సాగు నీరు అందించాలని కోరుతూ బుధవారం నీటిపారులదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు లేఖ రాశారు. సాగునీరు ఇస్తారా లేదా పంట వేయాలా వద్ద అనే ఆందోళనలో రైతులు ఉన్నారని తెలిపారు. యాసంగి పంటకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సిఎం కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ నిర్మాణాలను చేపట్టారని గుర్తు చేశారు. ఈ రిజర్వాయర్‌ల ద్వారా వరుసగా గత 3 ఏళ్ల జిల్లాలోని రైతాంగానికి గోదావరి జలాలు అందించామని తెలిపారు. అలాగే సిద్దిపేట, మెదక్, యాదాద్రి, జనగామ జిల్లాలకు తాగు నీరు అందించామని లేఖలో పేర్కొన్నారు. మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం 19.03, టిఎంసిలు, కొండపోచమ్మసాగర్‌లో 9.5, రంగనాయకసాగర్ లో 2.57, అన్నపూర్ణలో 3.21 టిఎంసిల నీరు అందుబాటులో ఉందన్నారు. సాగునీటిని అందించడానికి నీటి ప్రణాళికకమిటీని ఆదేశించాలని మంత్రి ఉత్తమ్‌ను కోరారు. మిడ్ మానేరులో ప్రస్తుతం 27 టిఎంసిల నీరు అందుబాటులో ఉందన్నారు. మిడ్‌మానేరు నుంచి మరిన్ని అవసరమైన నీటిని ఈ రిజర్వాయర్లకు లిఫ్ట్ చేసి పూర్తిస్థాయిలో రైతులకు సాగునీరు అందించాలన్నారు.నీటి విడుదలపై ఇరిగేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వం తరుపున ఉమ్మడి జిల్లా రైతాంగానికి భరోసా కల్పించాలని జిల్లా రైతుల పక్షాన విజ్ఞప్తి చేశారు.

### ఎస్సీ వర్గీకరణ కమిషన్‌ను కలిసిన మాల కుల నేతలు




కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం ఇస్తున్న మాల కుల నాయకులు

**కొండపాక, డిసెంబరు 4, ప్రభాతవార్త :** ఎస్సీ వరీకరణ చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ నియమించింది. కమిషన్ చైర్మన్ శామీవ్ అక్తార్ బుధవారం ఉమ్మడి జిల్లా కేంద్రం సంగారెడ్డిలో ఎస్సీ కులంలోని 59 కులాల నుండి అభిప్రాయాలను సేకరించడానికి సంగారెడ్డికి వచ్చారు. కమిషన్ చైర్మన్ బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా మాల మహానాడు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు విచారణలో పాల్గొని, వినతి పత్రాలు సమర్పించడానికి సిద్దిపేట జిల్లా నుండి సంగారెడ్డికి వెళ్ళారు. కార్యక్రమంలో నాయకులు గుడిమల్ల సత్తయ , అల్లిబిల్లి నర్సింగరావు, ర్యాకం శ్రీరాములు, పోతుల మోహన్, దార స్వామి పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణ కమిషన్‌ను కలిసిన ఎమ్మార్పీఎస్ నేతలు

**కొల్చారం, డిసెంబరు 4 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ విచారణకై ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌కు మాదిగ ఉప కులాల జీవన స్థితిగతులపై అధ్యయనం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను అందజేయాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు పుర్ర ప్రభాకర్ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రోళ్ల సంజీవయ్య, ఎంఎస్ఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షులు పుర్ర మహేష్, ప్రతాప్, జాన్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాలకు చెందిన మాదిగ ఉపకులాల నాయకులు తదితరులు ఉన్నారు.

### బాల్య వివాహాలపై అవగాహన

**వెల్దుర్తి, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విజన్ ప్రాజెక్ట్ వారు బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండని అమ్మాయిలు, 21 సంవత్సరాలు నిండని అబ్బాయిలు పెళ్లి చేసుకోకూడదని, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, చట్టాల గురించి వివరించారు. అలాగే బాల కార్మికులు, బాలల వేధింపులు, బాలల అక్రమ రవాణా గురించి చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో విజన్ ప్రతినిధి కైలాష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్యలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆర్గనైజర్ జీఎన్. రవి నిర్వహించడం జరిగింది. బాల్య వివాహాలు లేని దేశం కోసం అని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకట స్వామి, నర్సింహా రెడ్డి, ఛార్లెస్, అమూల్య, సునీత, శైలజ, వెంకట్ రెడ్డి, విజయ్, ప్రశాంతి, రాధిక, రేణుక, అర్చన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## ఒకేచోట ప్రభుత్వ కార్యాలయాలు

### 15 రోజుల్లోగా స్థల సేకరణ చేయాలి... వైద్య ఆరగ్యో శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

**చౌటకూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త:**

మండలకేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని పక్షం రోజుల్లోగా సేకరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం చౌటకూరులో తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల ఏర్పాటుకు అవససరమైన స్థలాన్ని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. స్థలాన్ని సర్వే నిర్వహించి ఎన్ఆర్ఈజీఎస్ కింద సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేయాలన్నారు. మంత్రి దామోదర్ రాజనర్సింహా చొరవతో ప్రభుత్వం చౌటకూరు మండలానికి గెజిట్ విడుదలయ్యేలా చేసిన విషయం పాఠకులకు విధితమే. తహసీల్దార్, మండల పరిషత్, ఎంఈఓ, వ్యవసాయ శాఖ, పోలీసు ఠాణా, పిహెచ్‌సి, ఎన్ఆర్ఈజీఎస్, ఐకెపి, కస్తూర్బా పాఠశాల భవనాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపనలు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆయా కార్యాలయాల ఏర్పాటుకు చౌటకూరులో స్థలం లేనందున పోలీసు ఠాణా, పిహెచ్‌సి, కస్తూర్బా పాఠశాల భవన నిర్మాణాలను సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కలో నిర్మించనున్నట్లు, అందుకు అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు.చౌటకూరు శివారులోని బసన్నవాగువద్ద 10 ఎకరాలవరకు ప్రభుత్వ భూమి ఉందని, అక్కడే అన్ని కార్యాలయాలు నిర్మిస్తే ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. చౌటకూరులో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమి మండలానికి చివర ఉన్న గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, ప్రధాన కార్యాలయాలైన తహసీల్దార్, మండల పరిషత్ తదితర కార్యాలయాలు చౌటకూరు గ్రామంలోనే ఉంటాయని మంత్రి నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అందోల్-జోగిపేట ఆర్‌డిఓ పాండు, తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నత్తి దశరథ్ నాయకులు మల్లారెడ్డి, కలాలి ఈశ్వర్‌గౌడ్, గోవర్ధన్ ముదిరాజ్, మహిపాల్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, వర్కల్ రమేష్,రామాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గొల్ల మహేష్, కైసర్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయ పాలక మండలి నియామకానికి కొత్త జీవో

**నేతలకు ఆరాటం..అధికారులకు ఇరకాటం**

**కొమురవెల్లి, డిసెంబరు 4, ప్రభాతవార్త :** శ్రీకొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పాలకమండలి నియామకం అందరికీ తలనొప్పిగా మారింది. దేవాదాయశాఖ నోటిఫికేషన్ జారీ చేయగానే నిబంధన ప్రకారం ఆలయ ధర్మకర్తల మండలికి 80 మంది అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు దరఖాస్తు చేసుకున్నారు. జనగామ ఇంచార్జి కొమ్మూరు ప్రతాప్‌రెడ్డి సిఫారసు లేఖను దేవాదాయశాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఇటీవల పంపించారు. వారు పంపించిన సిఫారసు లేఖలో పేర్కొన్న నాయకుడిపై కేసులు నమోదై ఉండడంతో దేవాదాయశాఖ చట్టంలోని నిబంధన మేరకు ఆలయ పాలకమండలి లేదా ఉత్సవ కమిటీ చోటు కల్పించే అవకాశంలేకపోవడంతో దేవాదాయశాఖ కమిషనర్ సదర్ నాయకుడి పేరు కాకుండా ఇతరులతో కమిటి నియమిస్తామని చెప్పడంతో అధికార పార్టీ నేతలు తలలుపట్టుకుంటున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు సమీపించడంతో వెంటనే కమిటీని నియమించాలని కోరుతూ మంగళవారం పలువురు నేతలు ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు వేము నరేందర్‌రెడ్డిని కలిసినట్లు తెలిసింది.

**8 మంది సభ్యులతో కమిటీ**

8 మంది సభ్యులతో శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ కమిటీని నియమిస్తూ దేవాదాయశాఖ అధికారులు మంగళవారం జీవో 463 జారీ చేశారు. కమిటీలో లింగంపల్లి శ్రీనివాస్, కాగిత మోహన్, అల్లం శ్రీనివాస్, కొమురయ్య, వల్లద్రి అంజిరెడ్డి, మామిడాల లక్ష్మీ, నేరెళ్లపల్లి మహేందర్‌రెడ్డి, కొప్పురపు జయప్రకాష్‌రెడ్డిలకు చోటు కల్పించారు. ఆలయ ధర్మకర్త మండలి చోటు కోసం తాజాగా దరఖస్తు చేసుకోవాలని జీవో 464 జారీ చేశారు. ధర్మకర్త మండలిలో 14 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా 8 మందిని నియమించగా మిగిలిన ఆరుగురు సభ్యులకు జీవో జారీ చేశారు. ఇప్పటికే 72 మంది దరఖాస్తు చేసుకోగా నూతనంగా మరో జీవోజారి చేసి తిరిగి దరఖాస్తు చేసుకోవాలని కోరడం వెనక ఏంటి అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### తహసీల్దార్ కార్యాలయం పట్టణంలో ఏర్పాటు చేయాలి

**మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించిన సిపిఐ నాయకులు**



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో పట్టణంలో ఉండాల్సిన తహసీల్దార్ కార్యాలయాన్ని కిషన్ నగర్‌లో నిర్మించిన సమీకృత భవనంలో ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంత ప్రజలే అనేక ఇబ్బందులు పడుతున్నారని ఈ తహసీల్దార్ కార్యాలయాన్ని వెంటనే పట్టణంలో ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు గడిపె మల్లేష్ బుధవారం రోజున రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మ ంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తహసీల్ కార్యాలయం పట్టణ ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు,వ్యవసాయ భూముల కోసం రైతులు,వికలాంగులు,మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కావున ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కరం కోసం ఇటీవల ఖాళీ అయిన మున్సిపల్ కార్యాలయ భవనంలోకి కార్యాలయాన్ని మార్చాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవరెడ్డి,మల్లారెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం వల్లే సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం

### రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 4, ప్రభాతవార్త**

గత ప్రభుత్వం పదేళ్ల అధికారంలో చేసిన ఆర్థిక విధ్వంసం వల్లే రాష్ట్రంలో కొన్ని సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం అవుతోందని రాష్ట్ర రవాణ, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో శాసనసభ ఎన్నికలు పూర్తయి సంవత్సరం గడిచిందని, నేటి నుండి ఈనెల 9వ తేదీ వరకు అన్ని దేవాలయాలు, చర్చిలు, మసీదులలో ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ ప్రజలు ప్రార్థిస్తున్నారన్నారు. ఈ ప్రాంత రైతాంగం కోసం గౌరవెల్లి ప్రాజెక్టు ఎడమ కుడి కాలువలను పూర్తి చేసి 160 గ్రామాలకు సాగునీరు అందించాలని ప్రయత్నం చేస్తున్నామన్నారు.హుస్నాబాద్ నియోజకవర్గంలో రెండు లక్షలపైన పంటల రుణాలు తీసుకున్న రైతులు తమ కార్యాలయంలో సమాచారం ఇస్తే రుణమాఫీ చేయించే బాధ్యత తనదే అన్నారు. గత ప్రభుత్వానికి 1 లక్ష రూపాయల రుణమాఫీ చేయడానికే ఐదేళ్ల పట్టిందని ఎద్దేవాచేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపే 2లక్షల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉన్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే తమ పార్టీ కార్యకర్తలు సిద్దంగా ఉండాలన్నారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

హుస్నాబాద్ ప్రాంతంలో బుధవారం ఉదయం 7 గంటల 25 నిమిషాలకు ఒక్కసారిగా పలు సెకన్లపాటు భూమి కంపించింది. దీంతో నియోజకవర్గ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇండ్లలో ఉన్న ప్రజలు బయటకు పరుగులు పెట్టి ఒకరికొకరు ఏం జరుగుతోందో అని ప్రశ్నించుకున్నారు. కొద్ది సేపట్లోనే వాతావరణ శాఖ అధికారులు స్వల్పంగా భూకంపం వచ్చిందని స్పష్టం చేశారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకృతి పరంగా, వికృతి పరంగా ప్రమాద గంటికలు మోగితే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం కూడా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు, సామాజిక సేవకురాలు, పార్టీ నాయకురాలు కర్ణకంటి మంజులారెడ్డి తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తా

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి**



మాట్లాడుతున్న చిలుముల సుహాసినిరెడ్డి

**కొల్చారం, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని మల్లీనాథ సూరి గ్రంథాలయాన్ని బుధవారం మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి ఆకస్మికంగా తనిఖీచేశారు. గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించిన అనంతరం లైబ్రేరియన్ స్వామిని చైర్మన్ సువాసినిరెడ్డి ఏవైనా సమస్యలుఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో పాఠకులకు చదువుకోవడానికి అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా, ఇంకేమైనా అవసరం ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రంథాలయంలో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి మాట్లాడుతూ కొల్చారం గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తానని, గ్రంథాలయంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవన్నగారి శేఖర్, గంగసాని మహేశ్వర్ రెడ్డి, ఆశన్న గారి శ్రీశైలం, నీరుడి శంకర్ పాల్గొన్నారు.

## పటాన్‌చెరుకు బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎవరు ?

### రేసులో నేతలున్నా హైకమాండ్ మౌనం



ఆదర్శ్‌రెడ్డి



కొలన్ బాల్‌రెడ్డి



చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి

**గుమ్మడిదల, డిసెంబరు 4 ప్రభాతవార్త:**

పటాన్‌చెరువు నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీని ముందుండి నడిపించే నాయకుడు కరువయ్యారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పార్టీని వీడటంతో బిఆర్ఎస్ పార్టీ తరపున పటాన్ చెరువు నియోజకవర్గానికి చెప్పుకోవడానికి ఒక్క పెద్ద దిక్కు లేదు. నెలలు గడుస్తున్నా నియోజకవర్గ ఇన్‌ఛార్జిని నియమించడంలో అధిష్టానం సైలెంట్ అయిందని చెప్పవచ్చు. రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో ఎమ్మెల్యేతో సహా పార్టీ పెద్దలు కొందరు తప్ప మిగతా అందరూ బిఆర్ఎస్‌లోనే ఉన్నారు.ఉద్యమ కాలం నుంచి ఉన్న నేతలు చాలా మంది ఉన్నారు. నియోజకవర్గ పరిధిలోని జిన్నారం మండలం నుంచి కొన్ని సంవత్సరాలుగా కొలన్ బాల్‌రెడ్డి జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులను పొంది ప్రజలకు ఎంతగానో సేవ చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ తనకంటూ ఒక ప్రత్యేకత, గుర్తింపు తెచ్చుకున్నారు. కాంగ్రెస్‌పార్టీలోకి రమ్మని అధిష్టానం పలుమార్లు ఆహ్వానించినా వెళ్లకుండా బిఆర్ఎస్ పార్టీని అంటిపెట్టుకొనిఉంటూ ప్రజలకు సేవలు అందిస్తూ పార్టీలో కీలక సభ్యులుగా వ్యవహిస్తున్నారు. ప్రస్తుతం బొల్లారం చైర్మన్‌గా ఆయన సతీమణి రోజా బాల్‌రెడ్డి సేవలు అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ సింధురెడ్డి భర్త, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి తనయుడు ఆదర్శ్ రెడ్డి రాజకీయంగా గత ప్రభుత్వంలో ఎంతో గుర్తింపు తెచ్చుకొని ఎన్నో పదవులు పొంది ప్రజల్లో నిత్యం ఉంటూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకొని ఎంతగానో సేవచేస్తూ గ్రామాలలో తిరుగుతూ ఉన్నారు. గుమ్మడిదల మండలం నుండి బిఆర్ఎస్ పార్టీలో కీలకపాత్ర వహిస్తూ సీజీఆర్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు, ప్రస్తుత ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిల నాయకత్వంలో వారి అడుగుజాడల్లోనే నడుస్తూ ఉమ్మడి మండల నాయకులను నిత్యం కలుస్తూ ప్రజలకు కష్టం వస్తే ఆదుకుంటూ దేవాలయాలకు, అంత్యక్రియలకు, శుభకార్యాలకు ఆర్థిక సహాయం అందిస్తూ నిత్యం ప్రజల్లో ఉంటూ తనకంటూ గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆయన గుమ్మడిదల మండలం నుండి కీలక వ్యక్తిగా బిఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. నియోజకవర్గం ఏర్పడితే బిఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా నిలబడతానని చెప్పుకుంటూ ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. గుమ్మడిదల మండలం నుండి ప్రస్తుతానికి బిఆర్ఎస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉంటూ చురుకుగా పనిచేస్తున్నారు.పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు స్థానిక సర్పంచులను, ఎంపీటీసీలను ఒంటి చేతితో గెలిపించుకొని పార్టీకి ప్రాణం పోశారు. సీజీఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం పార్టీలో ఉన్న నేతలు దాదాపు ఉద్యమకాలం నుంచి పార్టీలోనే ఉన్నవారు మాత్రమే ఉన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలంగా ఉంది. ఇన్‌ఛార్జి లేకపోవడంతో అందరినీ సమన్వయం చేసి ముందుకు నడిపే వారు లేక ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు పార్టీ పరిస్థితి మారింది. ఇలాగైతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లిష్ట పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు.

పటాన్ చెరువు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జి ఎవరికి ఇచ్చినా ప్రజలలో నిత్యం ఉంటూ కార్యకర్తలకు కష్టసుఖాలలో ధైర్యం చెప్పే మంచి నాయకుడికి ఇవ్వాలని బీఆర్ఎస్ కార్యకర్తలు కోరుతున్నారు.

### హరీష్‌రావు కేసులకు భయపడే నేత కాదు

**మెదక్ మున్సిపాలిటీ, డిసెంబరు 4 ప్రభాతవార్త:** మాజీ మంత్రి హరీష్‌రావును రాజకీయంగా ఎదుర్కోలేక పెట్టిన అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్ఎస్ నాయకులు మామిళ్ల ఆంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజల మనిషి హరిష్‌రావు కేసులకు భయపడే నాయకుడు కాదని అన్నారు. రైతులకు ఇచ్చిన రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకుండా మాట తప్పిన ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను చీల్చి చెండాడుతున్న హరీష్‌రావును ప్రజల పక్షాన మాట్లాడకుండా ఉండడానికే అక్రమ కేసులు పెట్టి జైలులో పెట్టాలని చూస్తున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలే హరీష్ రావును కాపాడుకుంటారని అన్నారు.

### అక్రమ కేసులు బనాయిస్తే గుణపాఠం తప్పదు

**-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాల పునాదులపై ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా ఏ ఒక్క హామీనీ అమలు చేయడం చేతగాక రోజుకో టాపిక్ డైవర్షన్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాలయాపన చేస్తున్నారని గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి విమర్శించారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సర్కార్‌ను ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు చేస్తున్న మోసాలను అనుక్షణం ప్రజలకు తెలుపుతున్న ప్రజా నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. హరీష్‌రావుపై కక్షపూరితంగా కాంగ్రెస్ ప్రభుత్వం కేసులు పెట్టడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా ఎఫ్ఐఆర్‌లో బుక్ చేపించినా మీరు చేస్తున్న మోసాలను, ప్రజలకు ఇచ్చిన హామీలపై, అమలుకాని గ్యారంటీలపై అడుగడుగునా ప్రశ్నిస్తూ రేవంత్‌రెడ్డి మెడలు వంచుతామని హెచ్చరించారు. గతంలో చక్రధర్‌గౌడ్ నా ఫోన్ టాపింగ్ అయ్యిందని హరీష్‌రావుపై జూన్ 19న డిజిపికి ఫిర్యాదు చేశారని, విచారణ జరిపిన తర్వాత తన ఫిర్యాదులో నిజం లేదని భావించి నవంబరు 22న చక్రధర్‌గౌడ్ తనపిటిషన్‌ను ఉపసంహరించుకున్నారన్నారు. నేడు అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ అధికారిన్ని అడ్డుపెట్టుకొని రేవంత్‌రెడ్డి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల మధ్య తిరిగిన చరిత్ర హరీష్‌రావుది అని, హరీష్‌రావుపై అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. ప్రజా క్షేత్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్‌కు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి చంచాగాళ్లతో ఇలాంటి ఎన్ని తప్పుడు కేసులు పెట్టించినా హరీష్‌రావు భయపడరని, న్యాయస్థానం ద్వారానే ఎదుర్కొంటారని తెలిపారు. రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మానుకొని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని పాలన కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి. రాజమౌళి, మండల పార్టీ అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దీన్, మాజీ సర్పంచ్‌లు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు బొగ్గుల చందు, మర్కంటి వరలక్ష్మి కనకయ్య, శ్రీనివాస్, ఉమర్, అహ్మద్, యువజన విభాగం అధ్యక్షుడు స్వామిచారి, కటికె శ్రీనివాస్, యూనుస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# ఇసుకను తరలిస్తున్న లారీ సీజ్



అక్రమంగా తరలుతున్న లారీని సీజ్ చేసిన దృశ్యం

**నాగల్‌గిద్ద, డిసెంబరు 4, ప్రభాతవార్త:** అక్రమంగా ఫిల్టర్ ఇసుకను తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ బి.సాయిలు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కంది మండలం ఇస్మాయిల్ ఖాన్‌పేట్ గ్రామం నుంచి కర్ణాటకలోని ఔరాద్‌కు ఇసుకను తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు నాగల్‌గిద్దలో లారీని అదుపులోకి తీసుకున్నామన్నారు. లారీ యజమానితో పాటు లారీ డ్రైవర్ బాలాజీపై కేసు నమోదు చేసి లారీని తహసీల్దార్‌కు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

# బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్‌కు వీడ్కోలు




హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానించిన వీడ్కోలు పలుకుతున్న ఎస్ఐ

**నాగల్‌గిద్ద, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నాగల్‌గిద్ద పోలీసు ఠాణాలో హెడ్ కానిస్టేబుల్‌గా రాంసింగ్ అంకిత భావంతో విధులు నిర్వహించి సైబరాబాద్‌కు బదిలీపై వెళుతున్న సందర్భంగా ఎస్ఐ ఆయిలు, పోలీసు సిబ్బందితో కలిసి బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

# 10 నుంచి సిఎం కప్ క్రీడలు

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సిఎం కప్ క్రీడా పోటీలు జహీరాబాద్ పట్టణంలో ఈ నెల 10వ తారీఖున ప్రారంభించి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. మూడు రోజుల పాటు పురుషులకు, మహిళలకు కబడ్డీ, 18 సంవత్సరాల లోపు బాలురు, బాలికలకు వాలీబాల్, పురుషులు, మహిళలకు కోకో, పురుషులకు ఫుట్‌బాల్, 14 సంవత్సరాల లోపు, 20 సంవత్సరాల లోపు, పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్,అండర్ 18 జూనియర్స్, అండర్ 28 సీనియర్స్‌కు యోగా పోటీలు ఉంటాయన్నారు.రంజోల్ పాలిటెక్నికల్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించే సిఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల క్రీడాకారులు పట్టణ పరిధిలో వ్యక్తిగతం ఆన్‌లైన్‌లో ఈ నెల 6వ తేదీ వరకు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ ఎం ఉమామహేశ్వరరావు సూచించారు.

# ఎస్సీ వర్గీకరణకు వినతుల స్వీకరణ




సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్

**సంగారెడ్డి బ్యూరో డిసెంబరు 4, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై విచారణ జరపడానికి రాష్ట్రప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ సమీమ్ అక్తర్ బుధవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్లో ఎస్సీ కులసంఘాల నుండి వినతులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఏకసభ్య కమిషన్ చైర్మన్‌కు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వివిధ కులసంఘాల నాయకులు స్వచ్ఛందసంస్థల నుండి ఏకసభ్య కమిషన్ చైర్మన్ వినతులు స్వీకరించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ మాట్లాడుతూ, ఎస్సీ కులసంఘాల నుండి 212వినతులు అందాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులు, చరిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనంచేయడం కోసం కమిషన్ ఏర్పాటయ్యిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేక అధ్యయనం కోసం ప్రతిపాదనలు, వినతులు కీలకమైనవని తెలిపారు. సమాజంలోని అన్ని ఎస్సీ వర్గాల అభిప్రాయాలు పరిశీలించి, తగిననివేదిక సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి కులసంఘాల అభ్యర్థనలు సేకరించి, రాష్ట్రప్రభుత్వానికి పూర్తి నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎస్సీ కులసంఘాల నాయకులు అధికసంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమవినతులను కమిషన్‌కు అందించారు. అనంతరం కంది మండలకేద్రంలోని ఎస్సీ కాలనీని సందర్శించారు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా రాఘవేంద్ర

**ఝరాసంగం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులుగా మండలంలోని కుప్పానగర్ గ్రామానికి చెందిన బబి రాఘవేంద్ర ఎన్నికయ్యారు. ఇటీవల నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల ఫలితాలను బుధవారం సాయంత్రం పార్టీ వర్గాలు వెల్లడించాయి. మండలంలో పార్టీ అభ్యున్నతికి పార్టీ పెద్దల సూచనలు, సలహాలతో తన వంతు కృషి చేస్తానని రాఘవేంద్ర పేర్కొన్నారు.

## ప్రారంభోత్సవానికి ప్రముఖుల హాజరు

**తలకొండపల్లి,డిసెంబర్ 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో గురువారం ఉదయం 11:00 గంటలకు రామచంద్రయ్య నూతనంగా నిర్మించిన ఆర్ సి,ఏసి కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేయుచున్న తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు,మరియు మాజీ మంత్రి సబితా ఇంద్ర రెడ్డి,కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ రెడ్డి,గోరేటి వెంకన్న మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, గువ్వల బాలరాజ్,విచ్చేయుచున్నారు.

# స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యం

**షాద్‌నగర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేందుకు ఈషాదక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వేస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫిల్టర్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని పాఠశాల ఉపాధ్యాయులు, మాజీ ఎంపీటీసీ వాడ్యాల నరసింహ్మారెడ్డి ప్రశంసించారు. ఫరూఖ్‌నగర్ మండలం వెలిజర్ల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన నీటి శుద్ధికేంద్రాన్ని ఈషాదక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వేస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు మాజీ ఎంపీటీసీ నరసింహ్మారెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి స్వచ్ఛమైన నీరు అందించేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అభివృద్ధిలో భాగస్వామ్యులు కావడం అభినందనీయమని కొనియాడారు. మరిన్ని సేవా కార్యక్రమాలు తమ గ్రామానికి అందించాలని ఆకాంక్షించారు. గ్రామస్థులందరు నీటి శుద్ధి కేంద్రాన్ని వినియోగించుకొని, మెరుగైన ఆరోగ్యం పొందాలన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన

## సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి మున్సిపాలిటి డిసెంబరు 4,ప్రభాతవార్త తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుందని సంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు,సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు,మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి, క్రాంతి కిరణ్ డీసీఎంఎస్ చైర్మన్ శివ కుమార్ లతో కలిసి విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా చింత ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలుల్లో భాగంగా,మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు పై కేసు నమోదు చేశారని అన్నారు రుణమాఫీ ఆరు గ్యారెంటీ ల అమలుపై పోరాటం చేస్తున్న హరీష్ రావు పై కక్ష సాధింపు చర్యలు భాగంగా ఎఫ్ఐఆర్ నమోదు చేశారని ఆరోపించారు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో శిక్ష అనుభవించక తప్పదని హెచ్చరించారు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని గుర్తు చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఫ్యాక్షనిస్టుతీరులాగ ఉందని ఆరోపించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ మాట్లాడుతూ ప్రజా పాలన పై దృష్టి సారించకుండా ప్రతిపక్షం నాయకుల అనచివేతకే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్యకు రేవంత్ రెడ్డి అన్నదమ్ములే కారణమని ఆరోపించారు నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ కక్ష సాధింపు చర్యలు భాగంగానే ఎమ్మెల్యే హరీష్ రావు పై కేసు నమోదు చేశారని ఆరోపించారు అందోలు మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు ఎండగడుతూ మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీష్‌రావు కార్యక్రమాలు చేపడుతుండడంతో ఓర్వలేక కేసు నమోదు చేశారని ఆరోపించారు ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా న్యాయపంగా ఎదుర్కొంటామని అన్నారు.సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు,నక్క నాగరాజు,విష్ణు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

# సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కాశీనాథ్

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** దిన దినానికి మితిమీరిపోతున్న సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ ఎం కాశీనాథ్ అన్నారు. బుధవారం సైబర్ జాగ్రత్త దివాస్ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ ఫ్రాడ్స్,వివిధ రకాల నేరాలపై ఎస్ఐ కాశీనాథ్ అవగాహన కల్పించారు. సైబర్ ఫ్రాడ్ జరిగినప్పుడు ఏ విధంగా దాన్ని నిర్మూలించడానికి ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. సైబర్ ఫ్రాడ్ నివారణ కొరకు 1930కు డయల్ చేయాలన్నారు. ఎన్‌సిఆర్‌పి పోర్టల్‌ను ఉపయోగించాలన్నారు. డిజిటల్ అరెస్టుల గురించి వివరించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్‌లు వచ్చినా, గుర్తు తెలియని లింక్స్ వచ్చినా, ఎలాంటి ఎపికే ఫైల్స్ వాట్సప్ గ్రూపులో వచ్చినప్పుడు వాటిని క్లిక్ చేయకూడదన్నారు. ఫైల్స్‌పై క్లిక్ చేస్తే తమ ఫోన్‌లో సేవ్ అయిన బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్‌కార్డు వివరాలు వారు దొంగలించి బ్యాంక్ ఖాతాల నుంచి నగదును తస్కరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పట్టణ ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డి వెంకటేశం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హరీష్‌రావుపై సిఎం దివాలాకోరు రాజకీయం

–మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్ 4 ప్రభాతవార్త:** రేవంత్ రెడ్డి, చక్రధర్ గౌడ్ లాంటి సంస్కారం లేని చిల్లరనాయకులు మాజీమంత్రి హరీష్‌రావుపై ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు చేయించడం సిఎం దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనం అని మెదక్ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కేసు నమోదు చేయడం మూర్ఖపుచర్య అని తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ప్రజల సంక్షేమమే తన జీవిత ధ్యేయంగా పనిచేస్తున్న మాజీమంత్రి హరీష్‌రావుపై కేసు నమోదుచేయడం యావత్తు తెలంగాణ ప్రజానీకం గమనిస్తుందన్నారు. అంతే కాకుండా అమలుకాని హామీలు ఇచ్చి గద్దెనెక్కినటువంటి ఈ ప్రభుత్వం మోసపువిధానాలు ఎండగడతామని, ప్రజలకు అండగా నిలుస్తున్న హరీష్ రావును అక్రమకేసులతో నియంత్రించాలని అనుకోవడం అరచేతితో సూర్య కాంతిని ఆపినట్లు ఉంటుందన్నారు. ఎన్ని అక్రమకేసులు పెట్టినా హరీష్‌రావు రాష్ట్రప్రజల కొరకు ధైర్యంతో ముందుకు సాగుతూనే ఉంటారని, అందుకు యావత్తు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులందరం అండగా ఉంటామన్నారు. ఇకనైనా ఈ ఊకదంపుడు ఉపన్యాసాలు మాని నాయకులపై అక్రమకేసులు పెట్టడం పక్కన పెట్టి ప్రజల కోసం పనిచేయాలని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు హరీష్‌రావు ఈప్రభుత్వం మెడలు వంచుతూనే ఉంటాడని, ప్రజల కోసం బిఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రమైన పోరాటం చేస్తూనే ఉంటామని ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## విద్యార్థులు లక్ష్యంవైపు దృష్టిసారించాలి

ఎస్ఐ అరుణ్‌కుమార్

**నవాబుపేట డిసెంబర్ 04,ప్రభాతవార్త :** విద్యార్థి దశ అమూల్యమై నదని దాన్ని భవిష్యత్తుకోసం వాడుకోవాలని ఎస్ఐ అరుణ్‌కుమార్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనీయర్ కళాశాలలో సైబర్ క్రైం, మత్తు పదార్థలతో జరిగే విపత్కారంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్నాలజీ ద్వార లాభంతో పాటు విపరీతమైన నష్టం కూడా ఇమిడి ఉన్నదనే విషయాన్ని గుర్తించాలన్నారు. యుక్త వయసులో ఏదిచేసినా సరైందిగా అనిపిస్తుందని ఈ నేపథ్యంలో అవగాహలోపంతో టెక్నాలజీని తప్పుడు పనులకు వాడుతూ కొందరు యువతను తప్పుడు దారికీ మల్లిస్తున్నారని అన్నారు. ఈ విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరుచితులతో అన్‌లైన్‌లో జాగ్రత వహించాలని సూచించారు. సైబర్ క్రైంను సమష్టిగా రూపుమాపాలని పిలుపు నిచ్చారు. అదే విధంగా యువత చెడు అలవా ట్లకు లోనై బంగారు భవితను పాడుచేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డ్రగ్స్, గాంజా, తదితర మత్తు పదార్థాలకు బానిసలై చేజేతులా జీవితాలను నాశనం చేసుకోకూడదని హితవు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ సురేశ్‌కు మార్, ప్రొబెషనరి ఎసైలు మనీష, సూర్యకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గోన్నారు.

## ఆమనగల్‌కు తరలిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**తలకొండపల్లి డిసెంబర్ 4 ,ప్రభాతవార్త;**

తలకొండపల్లి మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం నాడు ఆమనగల్ తరలి వెళ్లారు. ఆమనగల్ పట్టణంలో నూతనంగా ఆమనగల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి మండలానికి చెందిన ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు మిట్టపల్లి అంజయ్య గుప్తా, కేశవరెడ్డి, వెంకట్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, అజీమ్‌లు పదవి బాధ్యతలు స్వీకరించనున్నందున కాంగ్రెస్ పార్టీ తలకొండపల్లి మండల అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తరలివెళ్లారు. రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖమాత్యులు జూపల్లి కృష్ణారావు, కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ సిడబ్ల్యూసి మెంబర్ చల్లా వంశీచంద్రెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాణ స్వీకారోత్సవం పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి తలకొండపల్లి మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాం, కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లు శ్రీనివాస్ మూర్తి, జోగు రమేష్, రాములు, అంబాజీ, డేవిడ్ , అజీమ్, మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, ఆయాగ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ప్రభుత్వం విఫలం

–బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** శాసన సభ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేసిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొలుకూరి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని శివాజీ విగ్రహం దగ్గర జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్ జగన్నాథ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా 6గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని గుర్తు చేశారు. రైతులను నిండా ముంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిరుద్యోగ భృతి, మహాలక్ష్మి పథకంలో మహిళలకు 2500 రూపాయలు, రైతు భరోసా చెల్లించకుండా మోసం చేస్తోందని ఆందోళన వ్యక్త చేశారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు గొల్ల భాస్కర్, మల్లికార్జున్‌పాటిల్, శ్రీనివాస్‌గౌడ్, సుధీర్ బండారి, బక్కయ్యగుప్త, అరుణకౌలాస్, సుభాష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు విశ్వనాథ్ స్వామి, ఆయా మండలాల అధ్యక్షులు వైద్యనాథ్, బంటు విశ్వనాథ్, శ్రీకాంత్, ఓంకార్‌యాదవ్, ఎంజి దుర్గయ్య, సుమ అనిల్, పట్లోళ్ల శోభారాణి, పూత సంతోష్, అప్పం శ్రావణ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా దశరథ్ నాయక్

**కడ్తాల్, డిసెంబర్ 4, ప్రభాత వార్త:** గిరిజన జాతి కోసం అహర్నిశలు పోరాడుతున్న జర్పుల రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, కడ్తాల్ మాజీ జెడ్పిటిసి జర్పుల దశరథ్ నాయక్ ను లంబాడి హక్కుల పోరాట సమితి గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించింది. షాద్ నగర్ లోని కేకే కన్వెన్షన్ హాల్లో జరిగిన రాష్ట్రస్థా యి లంబాడి హక్కుల పోరాట సమితి సమావేశంలో రాష్ట్ర మాజీ ఎస్సీ ఎస్టీ కమిషనర్, ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంపాల్ నాయక్ చేతుల మీదుగా ఈ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా రాంపాల్ నాయక్ మాట్లాడుతూ జాతి కోసం నిరంతరం శ్రమిస్తున్న దశరథ్ నాయక్ ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం చాలా సం తోషంగా ఉందని తెలిపారు. లగచర్లలో గిరిజనులకు అండగా ఉండి పోరాడిన దశరథ్ నాయక్ కు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు వచ్చిందని తెలిపారు. దశరథ్ నాయక్ లాంటి యంగ్ అండ్ డైనమిక్ లీడర్ సంఘంలో పనిచేస్తే రానున్న రోజుల్లో గిరిజన జాతికి చాలా మేలు జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా దశరథ్ నాయక్ మాట్లా డుతూ తమపై నమ్మకం ఉంచి తమకు రాష్ట్ర ఉపాధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు ఎల్ హెచ్ పి ఎస్ సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో తప్పకుండా జాతి మేలుకోరి జాతి ప్రయో జనాలు కాపాడడం కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. రాష్ట్ర గిరిజన సేవా సంఘం నాయకు లు డైరెక్టర్ సేవ్య నాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్ నాయక్, నాయకులు శ్రీను, జగన్, శ్రీకాంత్ ,గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిభావంతోనే సమాజంలో సుస్థిర శాంతి

శ్రీ శివానందస్వామి

**ఆమనగల్లు, డిసెంబర్04, ప్రభాతవార్త:** సమాజ శాంతిస్థాపనకు ప్రతిఒక్కరూ భక్తిభావన అలవర్చుకోవాలని శ్రీరామదూత ఆశ్రమం వ్యవస్థాపకులు శ్రీశ్రీశ్రీ శివానందస్వామి అన్నారు. సోదరభావం, సన్మార్గం, మానవతా దృక్పథం మనుషుల్లో కల్మషాలను దూరం చేసి దైవానుగ్రహానికి దగ్గర చేస్తుందని ఆయన వివరించారు. శ్రీఅభయాంజనేయ భక్తి మండలి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన కార్తీక మాస ఆకుపూజల ముగిం పు బుధవారం భక్తిశ్రద్దల మధ్య అట్టహాసంగా జరిగింది. ఈసంధర్బంగా ఆలయ అర్చకుడు రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హోమం వంటి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. కార్యక్రమానికి శ్రీశ్రీశ్రీ శివానందస్వామి ముఖ్య అతిథిగా హాజరై ప్రవచనాలు వెళ్ళడించారు. విష్ణుసహ్రనామ పఠనం చేశారు. కార్యక్రమంలో శ్రీ అభయాంజనేయస్వామి భక్త మండలి అధ్యక్షులు వల్లభుదాసు నారాయణగౌడ్, కార్యదర్శి దొంతు సత్యనారాయణ, గౌవర అధ్యక్షులు దామోదరాచారి, బుచ్చిరాములు, తల్లోజు జంగయ్య, పాలోజు కృష్ణయ్య, భాస్క ర్, దశరథం, నాగభూషణం, మాధవాచారి, బావండ్ల అంజనేయులు, పార్థసారిథి, ముక్కెరి కృష్ణయ్య, లక్ష్మయ్య, చెన్నకేశవులు, ఏలె నిరంజన్,బికుమాండ్ల సుధాకర్, కండె సుమన్, విడియాల ఆనంద్, కండె రాముడు, కోట అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## నడికుడ రఘునాథ్ యాదవ్ ఔదార్యం

**షాద్‌నగర్, డిసెంబరు 04 (ప్రభాతవార్త) :** ఆపదలో ఉన్నవారికి తనవంతు సాయంగా నేనున్నానంటూ వారికి ఆర్థికంగా, మనోధైర్యాన్ని నింపుతూ తోచినంత వరకు ఏదో విధంగా అనునిత్యం సేవ చేస్తూనే ఉంటానని, అంతర్జాతీయ సేవారత్న అవార్డు గ్రహీత, అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికుడ రఘునాథ్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన పెళ్లి రోజు సందర్భంగా పట్టణంలోని గ్రంథాలయం ఎదురుగా అరటిపళ్ల వ్యాపారం చేసుకునే జంగయ్య అనే వ్యక్తికి కొత్త పండ్ల బండి కొనుగోలు చేసుకునేందుకు గాను నాలుగు వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు. పండ్ల బండికి అయ్యే పూర్తి ఖర్చు భరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదవ మహాసభ షాద్‌నగర్ తాలుకా అధ్యక్షుడు షాబాద్ మల్లేష్ యాదవ్, పట్టణ అధ్యక్షుడు నక్క బాల్‌రాజ్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారం వెంకటేష్ యాదవ్, నడికుడ అశోక్ యాదవ్, చీపిరి వెంకటేష్ యాదవ్, అనిల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



అంగన్వాడీకేంద్రంలో అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాల దృశ్యం

**వెల్దుర్తి, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని అంగన్వాడీ కేంద్రంలో బుధవారం అక్షరాభ్యాసం, అన్న ప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మీ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ అంగన్వాడీ కేంద్రానికి వచ్చి అంగన్వాడీ కేంద్రంలో అందించే పౌష్టికాహారాన్ని ఇక్కడే భుజించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు శిరీష మాట్లాడుతూ ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలో చెకప్ చేయించుకొని వైద్యుల సలహాలు ప్రకారం వైద్య పరీక్షలు చేయింకోవాలని సూచించారు. డెలివరీ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రతించి నార్మల్ డెలివరీ అయితే అందుకు కృషి చేసుకోవాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి మాధురి అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులు, పిల్లల బరువులను అడిగి తెలుసుకున్నారు. బరువు పెరగడానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఎన్ఎం అనిత, అంగన్వాడీ టీచర్లు దేవలత, లక్ష్మీ, ఆశ మంజుల, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

## అన్న ప్రసాదం ..పరబ్రహ్మ స్వరూపం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

**నందిగామ,డిసెంబర్ 4, ప్రభాతవార్త :** అన్న ప్రసాదం ..పరబ్రహ్మ స్వరూపం అన్న ప్రసాద వితరణలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి (నందిగామ డిసెంబర్ 4 ప్రభాతవార్త) నందిగామ మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం నందిగామ మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌల్లపల్లి ప్రతాప్ రెడ్డి పలువురు ప్రముఖులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా వారు అన్న ప్రసాదం పరబ్రహ్మ స్వరూపమని, అన్న ప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసిం హులు, మాజీ ఎంపీటీసీ దేపల్లి కుమార్ గౌడ్, జిల్లెల్ల బాల్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, సుక్యా నాయక్, జటావత్ లక్ష్మణ్ నాయక్, నర్సింలు, కృష్ణ, అక్రమ్ ,రాములు ,కృష్ణ గౌడ్, రంజిత్ రెడ్డి, సాకేత్ రెడ్డిలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

-సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు

**కొడంగల్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** అభివృద్ధి పేరుతో రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని,ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ భూములు చేడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు.బుధవారం సిపిఎం వికారాబాద్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యులు బుస్స చంద్రయ్య అధ్యక్షతన కొడంగల్‌లో నిర్వహిం చారు.ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెంట్రాములు హజరై మాట్లాడారు.గతనెల 11న జరిగిన లగచర్ల ఘటన అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అద్వర్యంలో వామపక్ష రాష్ట్ర అగ్రనాయకులు గ్రామాన్ని సందర్శించి రైతు కుటుంబాలను పరామర్శించి వాళ్ళకు వారి కుటుంబాలకు భరోసా కల్పించి,గ్రామాల్లో ఉన్నటువంటి వాస్తవ పరిస్దితులు ఫార్మ కంపెనీకి రైతులు భూములు ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని,ఆ భూములు రెండు పంటలు పండే భూములని,2013 భూ సేకరణ చట్టం ప్రకారం రెండు పంటల భూములను సేకరించరాదని,ఇక్కడి పరిస్దితులను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుపోయి, సీఎంను ప్రభుత్వాన్ని పునరాలోచించే విధంగా కృషి చేయడం జరిగిందన్నారు. ఇండస్ట్రీయల్ కారిడార్‌కు గాని ప్రత్యామ్నాయ భూములు చూడాలని రైతుల భూములను తీసుకోవద్దని, సిపిఎం రాష్ట్రనాయకత్వం ఫలితంగా ఫార్మా భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయడం జరిగిందన్నారు. అందుకు సిపిఎం హర్షం వ్యక్తం చేయడం జరిగిందన్నారు. అభివృద్ధికి సిపిఎం అటంకం కాదని అభివృద్ధి పేరుతో పేదల భూములు సన్నకారు చిన్నకారు రైతుల భూములు ప్రభుత్వం తీసుకుంటే ఊరుకునేది లేదని అన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ధారూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త:** పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగసమందర్ పీహెచ్‌సిని సందర్శించిన ఆయన ఆసుపత్రిలో రికార్డులు, మందులను, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవిలత, ఇతర సిబ్బందితో మాట్లా డుతూ, ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు.

## నూతన మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ శాంతి

**ధారూరు,డిసెంబర్ 04, ప్రభాతవార్త:** ధారూర్ పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్‌గా బుధవారం డాక్టర్ శాంతి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నిషా సింగ్ డిఎంహెచ్ఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో డాక్టర్ శాంతి వచ్చారు.

## సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

**తలకొండపల్లి,డిసెంబరు 4, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన డి.ఎలమందరెడ్డి ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 32,000 రూపాయల చెక్కును అందజేసిన గౌరవ కాంగ్రెస్ పార్టీ నాయకులు కాసు శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తల్లి, కూతురు అదృశ్యం

**శివ్వంపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** తల్లీకూతుర్లు అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శభాష్‌పల్లి గ్రామానికి చెందిన ముచ్చర్ల రమేష్ గౌడ్ (32) ప్రైవేట్ ఉద్యోగి. తనకు మూడు సంవత్సరాల క్రితం పోతారం గ్రామానికి చెందిన పూజతో వివాహం జరిగింది. వీరికి రెండు సంవత్సరాల కూతురు నిషిత ఉంది. ఈనెల 3వ తేదీన రాత్రి సుమారు 10గంటలకు రమేష్, అతని భార్య పూజ (23), అతని తల్లి సుశీల కలిసి భోజనం చేసి పడుకున్నారు. రాత్రి సుమారు 2గంటల సమయంలో తల్లి సుశీల బాత్రూం కోసం లేచి చూసేసరికి కోడలు పూజ, ఆమె కూతురు నిషిత ఇద్దరు కనిపించలేరు. చుట్టుపక్కల వెతికిన బంధువులను ఫోన్ చేసి అడిగిన రాజుకు సమాచారం లభించలేదు. పూజ దామరంచ గ్రామానికి చెందిన తేజ అనే వ్యక్తితో ఫోన్లో అప్పుడప్పుడు మాట్లాడుతుండదని పూజ భర్త రమేష్ దామరంచ గ్రామానికి చెందిన తేజ అనే వ్యక్తిపై అనుమానం ఉన్నప్పుడు తెలిపారు. ఈ విషయంపై భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకర్ రెడ్డి తెలిపారు.

## గుండెపోటుతో రైతు మృతి

**దౌల్తాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త;** గుండెపోటుతో ఓ రైతు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లవాద్ గ్రామంలో బుధవారంరోజు చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గోకఫస్లావాద్ గ్రామానికి చెందిన దామరిగిద్ద పకిరప్ప(32) బుధవారం రోజు ఉదయం ఎప్పటిలాగె వ్యవసాయ పోలానికి వెళ్ళాడు.గ్రామంలోని వ్యవసాయపోలంలో మృతుడు పకిరప్ప కంది పంటను కోస్తూ ఉండగా చాతీలో నొప్పి వచ్చింది.ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా హుటాహుటిన మండల కేద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెల్లారు. పరిస్థితి విషమించడంతో కోస్గి ఆస్పత్రికి తీసుకెల్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు.మృతుడు పకిరప్పకు ఒక కుమారుడు,కుమార్తె ఉన్నారు.

# వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలి



తడి, పొడిచెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

## తడి, పొడి చెత్తపై అవగాహన

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులోగల హౌసింగ్‌బోర్డు, భరత్‌నగర్ కాలనీల్లో బుధవారం బేసిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ తడి, పొడి చెత్త వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత కోసం వారానికి రెండు గంటలపాటు శ్రమదానం చేయాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి ప్రతి రోజు వచ్చే మున్సిపల్ స్వచ్ఛ వాహనానికి అందించాలని తెలిపారు. చెత్తను రోడ్లపై, మురికి కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో వేయవద్దని, అలా వేసిన వారిని గుర్తించి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. తడిచెత్త, పొడిచెత్తను చక్కగా వేరుచేసిన వారిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అండర్ గ్రౌండ్ డ్రైనేజీలో ప్లాస్టిక్ వస్తువులు, డైపర్లు వంటి వాటిని వేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, బేసిల్ ఫౌండేషన్ సభ్యులు, హౌసింగ్ బోర్డు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మల్లేశంగౌడ్, రాజారామ్, మహబూబ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు, అత్తెల్లి శ్రీనివాస్, ఆర్‌పి పద్మ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుపై కేసు హాస్యాస్పదం



మాట్లాడుతున్న జింకల పర్వతాలు

**చేర్యాల, డిసెంబరు 4, ప్రభాతవార్త :** ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావుపై చక్రధర్ అనే వ్యక్తి కేసు పెట్టడం హాస్యాస్పదం అని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ అన్నారు. బుధవారం పర్వతాలు మాట్లాడుతూ చక్రధర్ ఉద్యోగాల పేరుతో సుమారు 6 వేల మంది నిరుద్యోగులను మోసం చేసి సమాజంలో తిరుగుతున్న వ్యక్తి హరీష్‌రావుపై కేసు పెట్టడం సిగ్గుచేటన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజల ఆదరాభిమానాలు పొందిన వ్యక్తి హరీష్‌రావుకు ప్రజల దీవెనలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఆయనతో మహేష్, సాగర్ ఉన్నారు.

## రెవెన్యూ డివిజన్ సాధనలో సిపిఎం ముందుంటుంది

**జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి**



మాట్లాడుతున్న మల్లారెడ్డి

**చేర్యాల, డిసెంబరు 4, ప్రభాతవార్త :** చేర్యాల రెవెన్యూ డివిజన్ పోరాటంలో సిపిఎం పార్టీ ముందుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు జేఏసి పేరుతో కాలయాపన చేసి నామినేటెడ్ పదవులు పొందాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్షను నీరుగార్చే విధంగా కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎన్నికలలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వాగ్దానాన్ని మరిచిపోయి వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఇదే అదునుగా తీసుకొని అధికార పార్టీ నాయకులు జేఏసిగా ఏర్పడి సొంత ప్రయోజనాల కోసం తప్పా రెవెన్యూ డివిజన్ సాధించాలని చిత్తశుద్ధితో లేరని అన్నారు. సిపిఎం పార్టీ ఎల్లప్పుడు ప్రజల పక్షాన రెవెన్యూ డివిజన్ కొరకు పోరాడుతుందని అందుకు ప్రతిపక్షపార్టీ నాయకులు, మేధావులు, ప్రజలందరు కలసి రావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకటమావో, బద్దిపడిగా కృష్ణారెడ్డి, అత్తిని శారద, బండ కింది అరుణ్‌కుమార్, తాడూరి రవీందర్, ఎండి షఫి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## హరీష్‌రావుపై తప్పుడు ఆరోపణలు చేయడం సిగ్గుచేటు



మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**చిన్నకోడూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త :** తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావును జైలులో పెట్టాలని చూస్తే సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు చక్రధర్‌గౌడ్‌లకు తగిన శాస్తి జరగక తప్పదని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కాముని శ్రీనివాస్, ఎంపిటిసిల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఇట్టబోయిన శ్రీనివాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జంగిటి శ్రీనివాస్ హెచ్చరించారు. బుధవారం చిన్నకోడూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హరీష్‌రావును కావాలని నిరాధారమైన ఆరోపణలు చేస్తూ ప్రజల్లో చులకన చేయాలని చూడడం అకాశంపైన ఉమ్మినట్లుగా ఉంటుందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలం కావడంతో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల, రైతుల పక్షాన పోరాటం చేస్తున్న హరీష్‌రావుపై తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టించడం సిగ్గుచేటన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు ములకల కనకరాజు, గుజ్జ రాజు తదితరులు ఉన్నారు.

## హరీష్‌రావు పాపం పండింది : కాంగ్రెస్

**చిన్నకోడూరు, డిసెంబరు 4, ప్రభాతవార్త :** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు పాపం పండిందని వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అంకర్ మధు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి కనకరాజు (బైండ్ల)లు పేర్కొన్నారు. చిన్నకోడూరులో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. అధికారంలో ఉన్నంత కాలం ప్రతిపక్ష నాయకులను చిత్రహింసలకు గురిచేసిన హరీష్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. త్వరలో హరీష్‌రావు అక్రమాలు అన్ని బయటకు వస్తాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్‌రావు ఊసలు లెక్కపెట్టడం ఖాయన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

### అటవీ రేంజ్ అధికారి వినాయక్

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** జీవ వైవిధ్యంకోసం వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్ పేర్కొన్నారు. ప్రజా పాలన సంబరాల్లో భాగంగా బుధవారం కోమటిబండ, రంగంపేట, మైలారం తదితర గ్రామాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించడంతో పాటు అడవుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణానికి ముప్పుగా పరిణమించే అడవులకు నిప్పు పెట్టవద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా జంతు, వృక్ష జాలం సంరక్షణతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని తెలిపారు. దీర్ఘకాలిక లక్ష్యంతో ప్రాథమిక దశ నుండే విద్యార్థులను వన్యప్రాణుల సంరక్షణపై చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కొందరు అక్రమార్కుల ఫలితంగా జంతువులు, వన్యప్రాణులు, వృక్షాలకు ముప్పు వాటిల్లుతున్న దృష్ట్యా కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని హెచ్చరించారు. వాటకి నష్టం జరిగితే మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లుతుందని, ప్రకృతి సమతుల్యతలో వన్యప్రాణులు, వృక్షాలు, జంతువుల సంరక్షణ ఒక భాగంగా భావించాలని ఆకాంక్షించారు. వాతావరణ సమతుల్యతను దృష్టిలో పెట్టుకొని మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించే బాధ్యతను చేపటాలని వివరించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ ర్యాలీలో వన్యప్రాణులను సంరక్షించాలని, అడవులను కాపాడాలని, నిప్పు పెట్టవద్దని నినాదాలు చేశారు. కార్యక్రమంలో గజ్వేల్ సెక్షన్ అధికారులు పవన్‌కుమార్, బాలేశం, సిబ్బంది రాజు, స్వామి, కిషోర్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గజ్వేల్ రేంజ్ అటవీ అధికారి వినాయక్



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

## ఆత్మగౌరవ సదస్సును జయప్రదం చేయండి

**తెలంగాణ రాష్ట్ర కళాకారుల కన్వీనర్ పోశెట్టి**

**హుస్నాబాద్ రూరల్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** ఈ నెల 21వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే కళాకారుల ఆత్మ గౌరవ సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కళాకారుల కన్వీనర్ యెల్లా పోశెట్టి అన్నారు. బుధవారం పట్టణంలోని వివిల్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగిన కళాకారుల సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఎంతో మంది కళాకారులు తమ సర్వస్వాన్ని కోల్పోయారని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో వారికి ఎలాంటి గుర్తింపు లభించలేదన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో తమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు రామారావు, గడిపె మల్లేష్, చిట్టిగోపాల్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మీనయ్య, సత్యనారాయణ, కనుకయ ఉన్నారు.

## వ్యవసాయ మార్కెట్ మండల కమిటీ బాధ్యతల స్వీకరణ

**కోహెడ, డిసెంబరు 4, ప్రభాతవార్త :** మండల వ్యవసాయ మార్కెట్ నూతన పాలక మండలి సభ్యులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన కమిటీ చైర్మన్‌గా బోయిని నిర్మల జయరాజ్, వైస్ చైర్మన్‌గా భీంరెడ్డి తిరుపతిరెడ్డి, సభ్యులుగా మహ్మద్‌అంకుష్, పులి రాజు, చామంతుల శ్రీధర్, గాదాసు రాజేందర్, దూలం శ్రీనివాస్‌గౌడ్, సుంకరి సారయ్య, బిజుగు యాదగిరి, చింతపల్లి జనార్దన్‌రెడ్డి, మౌటం విజయ, చేపూరి శ్రీశైలంలు పదవి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి, మార్కెట్ కార్యాలయ ఇంచార్జి పరమేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య, మండల వ్యవసాయ అధికారి సతీష్, ఎఈవో మహిపాల్‌రెడ్డి, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా పొంద్రాల దాము

**అక్కన్నపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా పొంద్రాల దాము విజయం సాధించారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో మొత్తం 1483 ఓట్లు పోలవ్వగా అందులో 821 ఓట్లు దాము సాధించగా చొక్కం గణేష్ 360, నర్తిని మునిరాజ్ 2809 సాధించారు. మొత్తానికి మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన పొంద్రాల దాము 421ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా దాము మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన పార్టీ నాయకులకు ముఖ్యంగా యువతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### హరీష్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సిద్దిపేటలో తిరగనియ్యం

**-బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్**

**గజ్వేల్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** మాజీ మంత్రి హరీష్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సిద్దిపేటలో తిరగనియ్యమని బిఆర్ఎస్ కొండపాక మండల అధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ హెచ్చరించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ యువతకు ఉద్యోగాల పేరుతో కోట్ల రూపాయలను వసూలు చేస్తున్న ఓ ముఠా నాయకుడు హరీష్‌రావుపై విమర్శలు చేయడం ఏమిటని మండిపడ్డారు. తెలంగాణ ప్రజల కోసం, ప్రజా సమస్యల పట్ల నిరంతరం పని చేస్తున్న ప్రజాగొంతుక హరీష్‌రావు అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన హోదాకు తగ్గట్టు ప్రవర్తించాలని, సిద్దిపేటలో ఏకైక చిల్లర రాజకీయ నాయకుడు చక్రధర్‌గౌడ్‌తో కేసులు పెట్టించడం చూస్తుంటే తెలంగాణ ప్రజల దృష్టిలో రేవంత్‌రెడ్డి అవహేళనకు గురయ్యాడని అన్నారు. చక్రధర్‌గౌడ్ చరిత్ర సిద్దిపేట ప్రజలకు తెలుసని, ఎంత మందిని మోసం చేశాడో వారంతా ప్రజలకు మీడియా ముఖంగా తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. హరీష్‌రావుకు కేసులు, జైలు కొత్త కాదని, ప్రజల కోసం ఎన్ని పోరాటాలకైనా, ఎన్ని త్యాగాలకైనా వెనుకాడమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కొండపాక యువజన విభాగం అధ్యక్షుడు చిక్కుడు భాను, పల్లె బాబు, కెమ్మసారం శ్యాంకుమార్, మైనార్టీనాయకుడు ఎండి.ముగ్దుమ్, విద్యార్థి నాయకుడు రాకేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నూనె కుమార్‌యాదవ్



పాఠశాల ఎదుట బైటాయించిన బిఆర్ఎస్ నాయకులు

## గురుకుల పాఠశాలకు తాళాలు వేయడం సిగ్గు చేటు

**బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరశురాం**

**హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** గురుకుల పాఠశాలల అధ్యాయనాకి వెళ్తున్న బిఆర్ఎస్‌వి నాయకులు పాఠశాలలకు రాకుండా ప్రభుత్వం తాళాలు వేయించడం సిగ్గుచేటని బిఆర్ఎస్‌వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంపల్లి పరశురాం మండిపడ్డారు. బుధవారం పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలకు తమ ఆయకుల బృధం వెల్లగా పాఠశాలలోకి ప్రిన్సిపాల్ ఎవరూ రావొద్దని గేటుకు తాళాలు వేయించారన్నారు. లోపలికి రావాలంటే కలెక్టర్ అనుమతి తీసుకోవాలని చెప్పారని వివరించారు. పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, కల్తీ ఆహారంతో ఎంతో మంది అస్వస్తతకు గురవుతున్నారని వారి సమస్యలు తెలుసుకోవాలని వెళ్తున్న నాయకులను ప్రభుత్వం అడ్డుకోవడం సబబు కాదన్నారు. ఇదే విషయంలో పాఠశాల ఎదుట బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొజ్జ హరీష్, నవీన్, కందుకూరి సతీష్, రమేష్, సైపుద్దిన్, శేఖర్, బాబు, మహేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజార్



యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ, మండల అధ్యక్షులను సన్మానిస్తున్న నేతలు

**గజ్వేల్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ పార్టీ మూడు నాలుగు నెలల క్రితం రాష్ట్రస్థాయి యువజన విభాగం అధ్యక్షుడితోపాటు పలు జిల్లాల, మండలాల ఎన్నికలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. గజ్వేల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అజార్‌కు 11వేల పైచిలుకు ఓట్లతో విజయం సాధించారు. అలాగే మండల అధ్యక్షుడిగా శేర్ల రాజశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ అధ్యక్షుడు అజార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, కొనమైన కన్నాయాదవ్, ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ వాహిద్, మజీద్ కమిటీ అధ్యక్షుడు మతీన్, అజ్గర్, ఆంజనేయులు, నక్క రేగొండ, శ్రవణ్‌కుమార్, సురేష్, రఘుపతి, దయ్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ బలోపేతానికి మరింత కష్టపడతా : బాల్‌నర్సయ్య

**కొండపాక, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రెండోసారి సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపికైన అమ్ముల బాల్‌నర్సయ్యకు పలు గ్రామాల పంచాయతీ కార్మికులు అభినందనలు తెలిపారు. ఈ నెల 1,2 తేదీల్లో సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో సిపిఎం జిల్లా మూడవ మహసభలను నిర్వహించారు. ఈ మహసభలో 21 మందితో జిల్లా నూతన కమిటీని నియమించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సయ్య పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి అయనకు మారోసారి జిల్లా కార్యవర్గంలో చోటు కల్పించినట్లు సంఘం నాయకులు తెలిపారు. పార్టీ ఇచ్చిన ప్రతి పిలుపును విజయవంతం చేస్తు, కార్మికులకు అందుబాటులో ఉంటున్నడని తెలిపారు. అమ్ముల బాల్‌నర్సయ్య మాట్లాడుతూ పార్టీ తనపై నమ్మకంతో మారోసారి అవకాశం కల్పించడం పట్ల అయన అనందం వ్యక్తం చేశారు. పార్టీకి బలోపేతానికి మరింత కష్టపడి పని చేస్తానన్నారు.

## విద్యార్థులకు పోషకాహారం అందించాలి : ఎంఇవో

**కొండపాక, డిసెంబర్ 4, ప్రభాతవార్త :**

ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు కనీస పరిజ్ఞానం పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఒ సత్తయ్య అన్నారు. బుధవారం కుకునూరుపల్లి మండలపరిధిలోని మాత్‌పల్లి, శాశీనగర్ పాఠశాలలను అయన సందర్శించారు. ఈ సందర్భంగా అయన విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులకు పోషకాహారం అందించాలని సూచించారు. మాత్‌పల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు రాజనర్సు చిత్రాల ద్వారా పాఠ్యాంశాలను బోధించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ సంతోష్, అయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ దామోదర్

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

**మర్కుక్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ దామోదర్ పేర్కొన్నారు. పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశాల మేరకు సైబర్ జాగృకత దివాస్ కార్యక్రమంలో భాగంగా మర్కుక్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వల్ల ఎన్ని ఉపయోగాలు ఉన్నాయో అన్ని అనర్థాలు ఉన్నాయని, సెల్‌ఫోన్ వినియోగం పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ ఉపయోగం పెరగడంతో సైబర్ మోసాలు పెరుగుతున్నాయని, మోసగాళ్ల ఉచ్చులో పడి నష్టపోకుండా ఉండాలని, ఇంటికి వెళ్ళాక తల్లిదండ్రులకు, బంధువులకు, చుట్టుపక్కల వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో ఎవరైనా మోసపోయినట్లయితే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి

**ఇందిరమ్మ కమిటీ సభ్యులు**

**గజ్వేల్ టౌన్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తామని ఇందిరమ్మ కమిటీ నూతన సభ్యులు ఈదుగాని శివులు, శీర్ల కృష్ణ, కొల్లూరి సత్యనారాయణ, నాగరాణి, దామరకుంట సుష్మలు పేర్కొన్నారు. బుధవారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలు కుల, మత, పార్టీలకతీతంగా అర్హులైన వారికి అందేలా కృషిచేస్తామన్నారు. పది సంవత్సరాలలో ఏ ఒక్కరికి పథకాలను వర్తింపజేయని ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీ ఈరోజు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను అడ్డుకోవడం మంచిపద్ధతి కాదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు.

## బెక్కల్‌లో జనకల్యాణ్ దివస్

**దూళిమిట్ట, డిసెంబరు 4, ప్రభాతవార్త :** మండలంలోని బెక్కల్ గ్రామంలో బీఎస్పీ మండల అధ్యక్షుడు గెండె ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో జన కళ్యాణ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనగామ నియోజకవర్గ అధ్యక్షుడు చిలుముల అర్జున్, ఉపాధ్యక్షులు తాండ్ర నిఖిల్, ప్రధాన కార్యదర్శి తాండ్ర సిద్దులు, జనగామ మండల అధ్యక్షులు జోగు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వరి నారు సకాలంలో పోసుకోవాలి : ఏఓ

**మర్కుక్, డిసెంబరు 4 (ప్రభాతవార్త):** యాసంగిలో రైతులు వరి నారు సకాలంలో పోసుకోవాలని మర్కుక్ మండల వ్యవసాయాధికారి టి. నాగేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు వానాకాలంలో వరి నారు ఆలస్యంగా పోసుకోవడం వల్ల దిగుబడి తగ్గుతున్నాయని, యాసంగిలో కోసే సమయంలో వడగండ్ల వర్షాలు కురిసి రైతులు నష్టపోతున్నారని అన్నారు. కావున రైతులు దీర్ఘకాలిక రకాలను (150 రోజులు) జూన్ చివరి వరకు, మధ్యకాలిక రకాలను (135 రోజులు) జులై 15 లోపు, స్వల్పకాలిక రకాలను (120 రోజులు) జులై చివరి వరకు నార్లు పోసుకోవాలని, నారుమడి పెంపకం నారుమడిని బాగా దున్నిన తర్వాత రెండు లేదా మూడు సార్లు దమ్ముచేసి చదును చేసుకోవాలని, కొంచెం ఎత్తులో నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసుకుంటే మంచిదని అన్నారు. ఎకరానికి సరిపడే నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లే ముందు కిలో, 12 నుంచి 14 రోజులకు మరో కిలో), కిలో భాస్వరం, కిలో పోటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. జింకు లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలని, మెట్ట నారుమడిలో ఇనుప ధాతులోపాన్ని గమనిస్తే సరిచేసుకోవాలని, నారు పీకే ఏడు రోజులముందు ఒక్కోగుంట మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు ఇసుకలో కలిపి చల్లుకోవాలని, నీరు పలుచగా ఉంచాలని సూచించారు.

## విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

**కోహెడ, డిసెంబరు 4, ప్రభాతవార్త :** కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేద విద్యార్థులకు బుధవారం రోటరీ క్లబ్ పాస్ట్ గవర్నర్ బికె అనంద్, క్లబ్ అధ్యక్షులు గోరిట్యాల వెంకటకిషన్, ప్రధాన కార్యదర్శి పవన్ కృష్ణ, పిఏసిఎస్ చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావుల సహకారంతో ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. భవిష్యత్‌లో పేద విద్యార్థుల కోసం మరిన్ని సేవ కార్యక్రమాలు చేపడుతామని రోటరీ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్, అమ్మ అదర్శ కమిటీ చైర్మన్ ముంజ మంజుల, మాజీ ఎంపిటిసి తిప్పారపు నాగరాజు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఇసుకను స్వాధీనం చేసుకున్న పోలీసులు

## అక్రమంగా డంప్ చేసిన ఇసుక స్వాధీనం

**సిద్దిపేట అర్బన్, డిసెంబరు 4, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని నర్సాపూర్ చౌరస్తా శివ ధర్మకంట సమీపంలో అక్రమంగా డంప్ చేసిన 100 టన్నుల ఇసుకను బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నంగునూర్ మండలం తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన చెల్లారం వెంకటకృష్ణారెడ్డి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను డంప్ చేయడంతో ఇసుకను హిటాచిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

## పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌పోలీసుల దాడులు

**దూళిమిట్ట, డిసెంబరు 4, ప్రభాతవార్త :** దూళిమిట్ట మండలం తొర్నాల గ్రామ శివారులో జిల్లా టాస్క్‌ఫోర్స్, మద్దూరు పోలీసులకు కొంత మంది పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో దాడిచేసి ఐదుగురిని అదుపులోకి తీసుకోగా ముగ్గురు పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. వారి నుండి రూ.4780, 6 మొబైల్ ఫోన్లు, 6 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. జిల్లాలో ఎక్కడైన చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.



పేకాట స్థావరం వద్ద పట్టుబడినవారిని చూపిస్తున్న పోలీసులు

## బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను నిలిపివేయాలి

**సిద్దిపేట రూరల్, డిసెంబరు 4, ప్రభాతవార్త :**

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే నిలిపివేయాలని..ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్‌ను జైలు నుంచి విడుదల చేయాలని వికాస తరంపరని, వీరశైవ బలిజ, వికాస తరంగాన్ని, భగవత్‌గీత్, బార్ అసోసియేషన్, సుందర సంతు, ఆర్యవైశ్య, హిందూ ఐక్యవేదిక తదితర సంఘాల ప్రతినిధులు రంగశ్రీతాదాస్, కొత్తకొండ శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ, బైరి శంకర్ ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్ హిందువుల రక్షణకై జిల్లా కేంద్రంలోని సిద్దిపేట పాత బస్టాండులో బుధవారం సిద్దిపేట హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సంఘీభావసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాల్గొని మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని హిందువులు, ఇతర మైనార్టీలపై ఇస్లామిక్ ఛాందసవాదుల మహిళలపై దాడులు, హత్యలు, దోపిడీలు, దహనాలు, అమానవీయ దౌర్జన్యాలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయన్నారు. శాంతియుత నిరసనల్లో హిందువులకు నాయకత్వం వహిస్తున్న ఇస్కాన్ సన్యాసి చిన్మోయ్ కృష్ణదాస్‌ను బంగ్లాదేశ్ ప్రభుత్వం జైలుకు పంపడం అన్యాయమన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న అకృత్యాలను తక్షణమే నిలిపివేసి కృష్ణదాస్‌ను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గ్లోబల్ కమ్యూనిటీ సంస్థలు బంగ్లాదేశ్ బాధితులకు అండగా నిలువాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



పాత బస్టాండులో ధర్నా చేస్తున్న దృశ్యం

## జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఎంపిడివో మధులత



ఎంపిడివో మధులతకు నియామక పత్రాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

**నర్సాపూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల ఎంపిడివోగా విధులు నిర్వహిస్తున్న మధులత తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులురాలిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెదక్‌లోని టిఎన్జీవో భవన్‌లో మెదక్ జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నర్సాపూర్ ఎంపిడివో మధులతను మెదక్ జిల్లాగెజిటెడ్ ఆఫీసర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపిడివో మధులతకు తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ రావు చేతుల మీదుగా నియామక పత్రము అందజేశారు. గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలుగా తనను ఎన్నుకున్నందుకు ఎంత ఆనందంగా ఉందని ఎంపిడివో మధులత పేర్కొంటూ ఈ సందర్భంగా అందరి ఆఫీసర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## నర్సాపూర్‌లో బాలమేళా

**నర్సాపూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** ఈనెల 5వ తేదీన అనగా నేడు నర్సాపూర్ జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్, యాదవ ఫంక్షన్ హాల్ లో బాలమేళా నిర్వహించినున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ హేమభార్గవి, సూపర్వైజర్ సరళ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ నియోజక వర్గ కేంద్రమైన నర్సాపూర్లో ఐసిడిఎస్ అంగన్వాడి ఆధ్వర్యంలో బాలమేళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సునీత రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, డి డబ్ల్యు ఓ.. హాజరు అవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా రామాయంపేట సిడిపిఓ, ఆర్డిఓ, సైకాలజిస్ట్, లైఫ్ స్కిల్ ట్రైనర్ కొర్రపాటిసునీత, అధికారులు హాజరవుతున్నట్లువారు తెలిపారు.

## వరికొయ్యలను కాల్చొద్దు

**సిర్గాపూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** వరి పంటను కోసుకున్నాక మిగిలిపోయిన వరి కోయలను కాల్చేయకుండా భూమిలోనే దున్నుకోవాలని నారాయణఖేడ్ వ్యవసాయ సహాయ సంచాలకులు (ఎడిఎ) నూతన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో రైతులకు పంట సాగు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నూతన్ కుమార్ మాట్లాడుతూ వరి కోయలను కాల్చేయడంతో సేంద్రీయ కర్బను తగ్గి భూమి సారము కోల్పోయి నిస్సారంగా మారిపోతుందన్నారు. ఒక టన్ను వ్యర్థాలను (వరి కోయాలను) తగలబెట్టడంతో 60 కిలోల కార్బన్ మోనాక్సైడ్‌తో పాటుగా 1400 కిలోల కార్బన్ డయాక్సైడ్ గాలిలో కలిసి వాతావరణం కాలుష్యం పెరుగుతుందన్నారు. నేలలో తేమ శాతం తగ్గి పంట దిగుబడి తగ్గే అవకాశాలు ఉంటారని పేర్కొన్నారు. వరి కోయలను భూమిలో దున్నేయడంతో భూమిలో సేంద్రీయ గర్బణము పెరిగి నేలలో పగుళ్లు ఏర్పడే వర్షపు నీరు భూమిలోపలికి ఇంకడం జరుగుతుందని, ఫలితంగా భూమి పగుళ్ల జరగకుండా ఉంటుందని, దీంతో నేల కోతకు గురికాదన్నారు. వరి పంట వేసే ముందు రైతులు సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ 50 కిలోలు ఎకరానికి వేసి దున్నటం వల్ల త్వరగా 20 నుంచి 25 రోజులలో కుళ్లి నేలకు సేంద్రీయ గర్బణము పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. తన్ను వరిగడ్డి పెరగడానికి 6.2 కిలోల నత్రజని, 1.1 కిలోల భాస్వరం, 18.9 కిలోల పటాషియంతో పాటు సూక్ష్మ పోషకాలు అవసరం అని సూచించారు.

## లింగనిర్ధారణ వీర్యంతో పశుసంపద పెంపు



రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాంజీ

**సిర్గాపూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నాణ్యమైన పాడిసంపదకు పునరుత్పత్తికి యోగ్యమైన పాడిసంపద అవసరమని ఉమ్మడి మెదక్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ రాంజీ అన్నారు. బుధవారం జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పశుసంవర్ధకశాఖ సహకారంతో మండలంలోని కడపల్‌లో ఉచిత పశువైద్యశిబిరాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డాక్టర్ రాంజీ రైతులకు పలుసూచనలు చేశారు. ఆడదూడలు పుట్టేలా ప్రభుత్వం పశుసంపదను పెంచే ఉద్దేశంతో లింగ నిర్ధారణ వీర్యంతో అందుబాటులోకి తెచ్చిందన్నారు. పశువులు రోగాల బారిన పడకుండా జాగ్రత్త తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శిబిరానికి చేరుకున్న 76పశువులకు సాధారణ చికిత్సలు, 18పశువులకు గర్భస్థ పరీక్షలు, 5పశువులకు గర్భధారణ టీకాలు, 68దూడలకు నట్టల నివారణ మందులు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.సి క్రాంతి తెలిపారు. కార్యక్రమంలో గోపాల మిత్ర సూపర్‌వైజర్ తుక్కారెడ్డి, గోపాల మిత్రలు మల్లేశం, నారాయణ, సాయిలు, సంతోష్, పాడి రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న పార్టీ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్

**శివ్వంపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్ గౌడ్ అన్నారు, బుధవారం మండలంలోని గూడూరు కస్తూర్బాగాంధీ పాఠశాలను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ సందర్శించి పాఠశాలలో సదుపాయాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన, భోజనం గురించి అడిగి తెలుసుకుని విద్యార్థులతో పాటు భోజనంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. పాఠశాల సమస్యల గురించి ప్రధానోపాధ్యాయురాలు మంజుల వివరించారు. వాటి పరిష్కారానికి తప్పకుండా కృషిచేస్తామని సుదర్శన్‌గౌడ్ అన్నారు. ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వైస్‌ప్రెసిడెంట్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు మంతూరి రమేష్, కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపిటిసి జంగం విజయ వెంకటేష్, ఎస్టీసెల్ మండలాధ్యక్షులు తిరుపతిరాథోడ్, నాయకులు నరసింహచారి, శ్రీశైలం, నాగేష్, ప్రహ్లాద్ చారి, నాగరాజు నాయక్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు





తెల్లాపూర్‌లో ప్రజాపాలన విజయోత్సవ వేడుకల దృశ్యం



కళాకారుల ప్రదర్శనలో మాట్లాడుతున్న మాజీ ఎంపిటిసి రాములు యాదవ్

**రామచంద్రాపురం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న (డిసెంబరు 1 నుంచి 9వ తారీఖు వరకు) ప్రజా పాలన వియజోత్సవ వేడుకలను పురస్కరించుకుని తెల్లాపూర్‌లో విజయోత్సవాలు జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ మల్లేపల్లి లలిత సోమిరెడ్డి అధ్యక్షతన, పురపాలకశాఖ డిప్యూటీ డైరెక్టర్ వవి సాయినాథ్, మున్సిపల్ కమిషనర్ ఎం.సంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బాలగౌని రాములుగౌడ్, కౌన్సిలర్లు పాల్గొని వేడుకులను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కాంటినెంటల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు, మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్యశిబిరం ఏర్పాటుచేసి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు పిపిఈ కిట్లను పంపిణీ చేశారు. పురపాలక సంఘం పరిధిలో చెత్తతో పేరుకు పోయిన 5 ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి అందంగా ముగ్గులు వేయడాన్ని అందరూ అభినందించి శాలువాలతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందచేశారు. తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్, ఉస్మాన్‌నగర యుపిఎస్, వెలిమల తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పి.లచ్చిరాం, కొల్లూరు భరత్‌కుమార్, కంచర్ల శ్రీశైలం, మున్సిపల్ డిఈఈ సత్యనారాయణ, టిపిఎస్ మహేష్, ఏఈ మౌనిక, ఆర్వో వెంకటరామయ్య, సీనియర్ అసిస్టెంట్ మాధురి, వార్డ్ అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**హుగ్గెల్లిలో కళాకారుల ప్రదర్శన...**

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని హుగ్గెల్లి, కాశీంపూర్, గోపన్‌పల్లి గ్రామాల్లో బుధవారం ప్రజాపాలన ప్రగ తిపై జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు జిల్లా సమాచార పౌర సంబంధాలశాఖ అధికారి పర్యవేక్షణలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ఆయిదాల సునీల్, డి.రమేష్, ఎన్. దుర్గేష్, ఎస్.మల్లేష్, పి.సంధ్య, ఈ.వినేష్, బబిన నవీన్‌లు ప్రజలను ఉత్తేజపర్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమపథకాలు, చేపడుతున్న అభివృద్ధిపై కళాకారులు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో హుగ్గెల్లి మాజీ ఎంపిటిసి సభ్యులు యం.జి.రాములుయాదవ్, మాజీ సర్పంచ్ రాజు, హుగ్గెల్లి తండా మాజీ సర్పంచ్ కిషన్ నాయక్‌లు పాల్గొన్నారు.

**ఏడుపాయల్లో విజయోత్సవ వేడుకలు...**

**పాపన్నపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గాభవాని మాత ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయంలో కొలువున్న మూలవిరాట్‌ను బుధవారం తెల్లవారురుఝాము ఆలయ అర్చకులు అభిషేకం నిర్వహించి పలురకాల పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో చండీ హోమం నిర్వహించి ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శంకర్‌శర్మ, రాజేష్‌శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలకై సాధన చేయాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి మాధవి

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు వచ్చే విధంగా అధ్యాప కులు కృషిచేయాలని జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి మాధవి చెప్పారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆమె తనిఖీచేశారు. ఈసందర్భంగా తరగతిగదిలోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థితో మాట్లాడి సబ్జెక్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కళాశాలలో పలు రికార్డులను పరిశీలించారు.

ఈసందర్భంగా కళాశాల అధ్యాపకులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కళాశాలకు విద్యార్థులందరూ ప్రతిరోజు వచ్చేవిధంగా చూడాలన్నారు. కళాశాలకు రాని విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లి దండ్రులకు అవగాహన కల్పించి, పిల్లలను కళాశాలకు తీసుకురావాలని ఆదే శించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచే విధంగా తగుచర్యలు తీసుకో వాలన్నారు. ప్రతి సబ్జెక్టులో 90శాతం మార్కులు వచ్చేవిధంగా అధ్యాపకులు, విద్యాబోధన అందించాలన్నారు. ఇంటర్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు. సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ విషయంలో అధ్యాపకులు ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దన్నారు. కళాశాలలో ఉన్న ప్రొజెక్టరును వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రొజెక్టర్ ద్వారా విద్యార్థులకు పలు అంశాలు తెలియజేయాలని సూచించారు. అధ్యాపకులందరూ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. అనంతరం పట్టణంలో ఒకేషనల్ ఎలక్ట్రికల్ విద్యార్థుల నిర్వహిస్తున్న ఆన్‌జాబ్ శిక్షణా కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తంచేశారు.

## సిఎం కప్ క్రీడాపోటీలకు దరఖాస్తులు

**రామాయంపేట మున్సిపల్ కమిషనర్ దేవేందర్**

**రామాయంపేట మున్సిపాలిటీ, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఈనెల 7 నుండి 12 వరకు సిఎం కప్ క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ తెలిపారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్‌లు, కళాశాలల విద్యార్థులతోపాటు స్థానిక స్పోర్ట్స్‌క్లబ్, యువజన సంఘాలకు సంబంధించిన యువకులు ఈ క్రీడాపోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. అందులో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో, యోగా పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆన్‌లైన్, లేదా నేరుగా మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఓపెన్ స్కూల్ గడువు పొడిగింపు

**పాపన్నపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:**

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ గడువు పొడిగించినట్లుమండల ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ మహేశ్వర్, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ రియాజ్ అహ్మద్‌లు సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తారీఖువరకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజును చెల్లించవచ్చన్నారు. పూర్తి వివరాలకు 9912335581కు లేదా పాఠశాలను సంప్రతించాలని సూచించారు.

## గ్రంథాలయాన్ని పరిశీలించిన చైర్మన్ సుహాసినిరెడ్డి

**పాపన్నపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:**

గ్రంథాలయాలు విజ్ఞాన భాండా గారాలని, నిరుద్యోగులు, యువకులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవలని జిల్లా గ్రంథాలయాల చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని గ్రంథాలయాన్ని సుహాసినిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ సుహాసినిరెడ్డి గ్రంథాలయంలో భద్రపర్చిన పుస్తకాలక్రమాన్ని పరిశీలించి పుస్తకాల కొరతను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా చైర్మన్ సహాసినిరెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లాలో 20 గ్రంథాలయాలు ఉన్నా సిబ్బంది కొరత కొట్టొచ్చినట్లు కానవస్తోందని, సిబ్బంది కొరతను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి భర్తీ అయ్యేలా తనవంతు చర్యలు తీసుకుంటామన్నారు.

మెదక్ గ్రంథాలయానికి నిత్యం 100మందికి పైగా విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులు సద్విని యోగం చేసుకుని 70మంది వరకు నిరుద్యోగులు వివిధ ఉద్యోగాలు సంపా దించుకున్నారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు నిత్యం పుస్తకపఠనం చేయడాన్ని అలవర్చుకోవాలని, అందుకు గ్రంథాలయాలు ఉపయోగపడతాయన్నారు. గ్రంథాలయంలో ఫర్నిచర్ కొరతను తీర్చేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలని బాధ్యులకు సూచించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ఒకే సెక్రటరీ విధులు నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా సెక్రటరీ వంశీ క్రిష్ణ, మండల గ్రంథాలయ అధికారి నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాపన్నపేట విద్యార్థులు

**పాపన్నపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రస్థాయి మహిళావిభాగం కబడ్డీ పోటీలకు మండల విద్యార్థులు అశ్రీక, సుభానుల్లాలు ఎంపికైనట్లు పాపన్నపేట పిడి రమేష్ పేర్కొన్నారు. మాచారంలోని ఈ నెల 4వ తారీఖున నిర్వహించిన పోటీలలో ఇద్దరు విద్యార్థినులు గెలుపొంది ఈ నెల 7 నుంచి 10వ తారీఖు వరకు హైద్రాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో అశ్రీక, సుభానుల్లాలు తలపడతారన్నారు.

## గురుకుల పాఠశాలను పరిశీలించిన ఆర్‌డిఓ



అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఓ రాంరెడ్డి

**జహీరాబాద్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** అల్గోల్ మైనార్టీ గురుకుల పాఠశాలను బుధవారం ఆర్‌డిఓ ఎం.రాంరెడ్డి పరిశీలించారు. పాఠశాలలోని గదులను వంటశాలను, విద్యార్థులకు అందచేస్తున్న భోజన సదుపాయాలను, ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ఆర్‌డిఓ రాంరెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ఈసందర్భంగా ఆర్‌డిఓ రాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్ జె.రాములుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.రవీందర్, ఎంఈఓ బసవరాజ్ పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణకు వినతులు



ఎస్సీ వర్గీకరణకు వినతులు స్వీకరిస్తున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ సమీమ్ అక్తర్

**కంది, డిసెంబరు 4, ప్రభాతవార్త:** సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై విచారణ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ డాక్టర్ సమీమ్ అక్తర్ బుధవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోకి కలెక్టరేట్‌లో ఎస్సీ కులసంఘాల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా చైర్మన్ సమీమ్ అక్తర్ మాట్లాడుతూ ఎస్సీ కుల సంఘాల నుంచి 212 వినతులు అందాయన్నారు. వర్గీకరణకు సంబంధించి న్యాయపరమైన అంశాలు, సామాజిక పరిస్థితులు, చారిత్రాత్మక వ్యవహారాలను అధ్యయనం చేయడం కొరకు కమిషన్ ఏర్పాటయిందని గుర్తు చేశారు. సమాజంలోని అన్ని ఎస్సీవర్గాల అభిప్రాయాలను పరిశీలించి నివేదిక సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్నిప్రాంతాల నుంచి కులసంఘాల అభ్యర్థనలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, సాంఘిక సంక్షేమశాఖ అదనపు సంచాలకులు శ్రీధర్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి అఖిలేష్‌రెడ్డి, సంబంధిత శాఖాధికారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## కేతకి సంగమేశుడి ఆదాయం 33 లక్షలు



శ్రీకేతకి ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఝరాసంగంలోని శ్రీకేతకి సంగమేశ్వరుడి ఆలయహుండీని బుధవారం లెక్కించారు. ఆలయానికి గత 90రోజులుగా ఆయాప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారితో కొలువున్న స్వామివారిని దర్శించుకుని తమ మొక్కుబడిలో భాగంగా సమర్పిచుకున్న ఆదాయం ఆలయానికి 32లక్షల 98వేల 710 రూపాయల సమకూరినట్లు ఆలయ ఈఓ శశిధర్ తెలిపారు. ఆలయ హుండీలో విదేశీ కరెన్సీ ప్రత్యక్షంకావడం చర్చనీయాంశంగా మారింది. స్వామివారిని దర్శించుకునేందుకు విదేశీయులు వచ్చారా, లేక ఎన్ఆర్ఐలు స్వామివారిని దర్శించుకున్నారా అని భక్తులు చర్చించుకుంటున్నారు. ఆలయ హుండీని రాజరాజేశ్వరి సేవాసమితి బృందం సభ్యులు ఆలయ ఈఓ, పోలీసులు తదితరుల సమక్షంలో లెక్కించారు.

## పేదింటి ఆడబిడ్డ పెళ్లికి బిజెపి నేత ఆర్థికసాయం

**నర్సాపూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల పరిధిలోని రుస్తుంపేట గ్రామానికి చెందిన పేద కుటుంబమైన ఉప్పరి పెంటమ్మ కూతురు పెళ్లికి బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవిత రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మరో ఇద్దరు ఆడబిడ్డలు రుస్తుంపేట గ్రామానికి చెందిన గట్కరి సక్కుబాయి కూతురు సాయి భవాని పెళ్లికి, నాగులపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య పద్మ కూతురు పెళ్లిళ్లకు ఆమె ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు నీలి నాగేష్, ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వడ్ల శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు శ్రీకాంత్, గుర్రాల బాలరాజ్, నాయకులు పాల్గొన్నారు.

## కెసిఆర్ చిత్రాన్ని తిలకించిన బిఆర్ఎస్ నేతలు



కేసిఆర్ చిత్రాన్ని తిలకించేందుకు వెళుతున్న బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు

**రామచంద్రాపురం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర్‌రావుపై నటుడు రాకింగ్ రాకేశ్ తీసిన సినిమా కెసిఆర్ చరిత్రలో నిలిచిపోతుందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, బిఆర్ఎస్ రాష్ట్ర నేత వెన్నవరం ఆదర్శ్‌రెడ్డి, భారతీనగర్ కార్పొరేటర్ వెన్నవరం సింధురెడ్డిలు అన్నారు. బుధవారం రామచంద్రాపురం పట్టణంలోని సంగీత సినిమా థియేటర్‌లో బిఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి తన స్వంత ఖర్చులతో కెసిఆర్ సినిమాను థియేటర్‌లో ప్రదర్శింపచేశారు. ఈ సందర్భంగా చింత ప్రభాకర్, ఆదర్శ్‌రెడ్డి, సింధూరెడ్డిలు మాట్లాడుతూ కెసిఆర్ ఒక చరిత్ర అని, ప్రత్యేక రాష్ట్రం సాధించడమే కాకుండా దశాబ్ద కాలం పాటు రాష్ట్రాన్ని పాలించి ప్రతి ఒక్కరు సుభిక్షంగా ఉండేలా ప్రభుత్వపథకాలను అమలు చేశారన్నారు. ప్రతి తెలంగాణ వాసి కెసిఆర్ చిత్రాన్ని వీక్షించాలని సూచించారు. కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, గుమ్మడిదల బిఆర్ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

**రామచంద్రాపురం, డిసెంబరు 4, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ సండే మార్కెట్ వద్ద ఉన్న వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ బూరుగడ్డ పుష్ప నగేష్ ఆధ్వర్యంలో జిహెచ్ఎంసి ద్వారా కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి దివ్యాంగులకు పరికరాలు (ట్రైసైకిళ్లు, వీల్‌చైర్‌లు) పంపిణీ చేశారు. ఈసందర్భంగా కార్పొరేటర్ పుష్పనగేష్ మాట్లాడుతూ ఆత్మస్థైర్యం ఉంటే అంగవైకల్యం అడ్డుకాదని గుర్తుచేశారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరు సమానహక్కులు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ అధికారి జ్యోతి, మావీన్ గౌడ్, టౌన్ అధ్యక్షులు ఈశ్వర్ కపూర్, మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ హబీబ్, పీటర్, రంజీ,, శాంతమ్మ, నవీన్ గౌడ్, సంపత్ గౌడ్, సంతోష్, మహిపాల్ గౌడ్, కావలి నగేష్, సిఎం మల్లేష్, హబీబ్, ఎల్వర్తి మల్లేష్, రాజేష్, స్మార్ట్, రఫీ, శ్రీకాంత్, రమేష్, హన్మంతు, ప్రీతి గౌడ్, అశ్విని, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**శివ్వంపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండలంలోని కొంతన్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పరి సుశీల కొన్నిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా విషయం తెలిసి పిఎసిఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి 5వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెందిన కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటూ సహాయసహకారాలు అందిస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో రాయాలి యాదగిరి, పిండం శేఖర్, జంగం నర్సింలు, కుమ్మరి లక్ష్మయ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత

**శివ్వంపేట, డిసెంబరు 4, ప్రభాతవార్త:** మండలంలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ముంద్రాతి లచ్చయ్య గత కొన్నిరోజుల క్రితం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి లచ్చయ్య కుటుంబానికి నేనున్నానంటూ భరోసా ఇచ్చి ప్రభుత్వం నుండి మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ 60వేల రూపాయల చెక్కు కుటుంబానికి అందజేశారు. చెక్కు మంజూరుకు కృషిచేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డికి పిల్లుట్ల బిఆర్ఎస్‌పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు పిల్లి శివకుమార్, మాజీ ఎంపిటిసి బాలమణి బాలేష్, మాజీ ఉపసర్పంచ్, బుర్ర మహేష్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు చింత స్వామి, సంద్ర సత్యనారాయణ, బుర్ర పోచగౌడ్, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు బబ్బూరి వెంకటేష్, నాయకులు పిల్లి పెద్ద వెంకటేష్, గుల్లయ్యగారి రాములు, పిల్లి చిన్న వెంకటేష్, దాసరి వీరేష్, దాసరి పోచయ్య, బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి దప్పు వెంకటేష్, జనుముల గణేష్, చింత భాగ్య, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్

**నారాయణఖేడ్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణంలో నూతనంగా అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ యూనివర్సిటీ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ డాక్టరు పి.రమేష్ ప్రకటించారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ప్రిన్సిపాల్ పి.రమేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ప్రత్యేకకృషితో అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ యూనివర్సిటీ మంజూరైందన్నారు. ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి పట్టుదలతో ఈ ప్రాంతం విద్యాభివృద్ధి కొరకు నిరుద్యోగ యువత కొరకు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాలలలో ఈక్లాసులు కొనసాగుతాయని ఈ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్‌రెడ్డి

**సిర్గాపూర్, డిసెంబరు 4, ప్రభాతవార్త:** సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వారు ఫోన్‌చేస్తే ఓటిపి, ఆధార్‌కార్డు వివరాలు ఇవ్వకూడదని సూచించారు. మాయమాటలు చెప్పి నమ్మేలా సుద్దులు చెబుతారని, ఎలాంటి పరిస్థితిలోనూ గుర్తు తెలియని వారికి ఓటిపి చెప్పవద్దన్నారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని వెంకటరెడ్డి విద్యార్థులకు సూచించారు.